సాక్షి
చిత్తూరు
ఆదివారం । 31 । డిసెంబర్ । 2023



వసతులు మెరుగు'బడి'

నాడు-నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక వసతులు సమకూరాయి. - 8లో



చిరుత.. కలత

తిరుమల నడకమార్గంలోని ట్రాప్ కెమెరాలో నమోదైన చిరుత, ఎలుగుబంటి సంచరిస్తున్న దృశ్యం కలకలం రేపింది.



యూరియా..కొరత లేదయా

ఆర్‌బీకేల్లో పుష్కలంగా ఎరువులు నిల్వ ఉన్నాయని, రైతులకు సరఫరా చేస్తున్నామని అధికారులు వెల్లడిస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

హెల్త్ సెంటర్ తనిఖీ



పరిశీలిస్తున్న జేడీ సునీల్‌నాయక్

చిత్తూరు రూరల్: స్థానిక టెలిఫోన్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ సునీల్‌నాయక్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వ్యాక్సినేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న ఆరోగ్య సురక్షను పకడ్బందీగా నిర్వర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఐఓ రవిరాజు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే న్యూ ఇయర్ వేడుకలు



ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్ : శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా నిబంధనల మేరకే న్యూఇయర్ వేడుకలు నిర్వహించుకోవాలని ఎస్పీ రిశాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలన్నారు. బహిరంగా ప్రదేశాలు, రోడ్లపై వేడుకలకు అనుమతిలేదని చెప్పారు. మద్యం తాగి వాహనాలు డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వేడుకల పేరుతో ఏవరైనా అత్యుత్సాహం ప్రదిర్శిస్తే 100, 112 నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

వరసిద్ధుని సేవలో నేషనల్ ఎస్సీ కమిషన్ డైరెక్టర్



సునీల్‌కుమార్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని నేషనల్ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్‌కుమార్ శనివారం సేవించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందించారు.

స్వర్ణరథంపై వరసిద్ధుని విహారం



స్వర్ణరథంపై ఊరేగుతున్న స్వామివారు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారు స్వర్ణరథంపై మాడవీధుల్లో విహరించారు. శనివారం సంకటహర చతుర్థి వ్రతం సందర్భంగా సిద్ధి, బుద్ధి, సమేత వినాయక స్వామి ఉత్సవర్లను అలంకార మండపంలో కొలువుదీర్చారు. విశేష పూజల అనంతరం స్వర్ణరథంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకటేశు, ఉభయదారుల సంఘం అధ్యక్షుడు ఈశ్వర్ బాబు, ఉప సర్పంచ్ విశ్వనాథరెడ్డి, చిన్నారెడ్డి, పుణ్యసముద్రం రవి, రవిరెడ్డి, రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పుంగనూరు పులకించె!

కళ్లు చెదిరే భవనాలు.. ఆకట్టుకునే అంతర్గత రహదారులు.. ఆహ్లాదం పంచే పచ్చని చెట్లు.. మెగా టౌన్‌షిప్‌లను తలపించే కాలనీలు.. అత్యాధునిక వసతులు.. చరిత్రలో చిరస్థాయిగా నిలిచేలా నిర్మాణాలతో పుంగనూరులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌లు.. టిడ్కో గృహ సముదాయాలు కళకళలాడుతున్నాయి. నిరుపేదల సొంతింటి కలలను నెరవేరుస్తున్నాయి. వేలాది మంది నివాసాలతో ఊళ్లనే తలపిస్తున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సత్సంకల్పానికి సాక్ష్యాలుగా అలరారుతున్నాయి. పేదలందరి ఇళ్లలో నవరత్న వెలుగులను ప్రసరింపజేస్తున్నాయి.



పుంగనూరు పట్టణంలోని టిడ్కో గృహ సముదాయం

- ఊళ్లుగా మారిన జగనన్న కాలనీలు
- సాకారమైన నిరుపేదల కలలు
- సొంతిళ్లలోకి వేలాదిమంది లబ్ధిదారులు
- ఆహ్లాదకర వాతావరణంలో నివాసాలు

పుంగనూరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు– పేదలందరికీ ఇళ్ల పథకం కింద పుంగనూరు నియోజకవర్గంలో సుమారు 12,196 మంది లబ్ధిపొందారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం ప్రత్యేక దృష్టి సారించడంతో వేలాది మంది త్వరితగతిన స్వగృహ ప్రవేశం చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి తమ సొంత నియోజకవర్గంపై మరింత శ్రద్ధ తీసుకున్నారు. రూ.కోట్ల విలువైన సుమారు 104 ఎకరాల భూమిని జగనన్న కాలనీలకు కేటాయించారు. ఏర్పాటైన మొత్తం 71 కాలనీల్లో చక్కటి మౌలిక వసతులు కల్పించారు. లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించేలా చర్యలు చేపట్టారు. తద్వారా శరవేగంగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకునే అవకాశం అందించారు. ఈ క్రమంలోనే పుంగనూరు మున్సిపల్ పరిధిలో నిర్మించిన 1,536 టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. ఆయా ప్రాంతాల్లో అత్యాధునిక మౌలిక వసతులు ఏర్పాటు చేయించారు.



పుంగనూరు మండలంలోని జగనన్న కాలనీ

మేలు మరువలేం



సొంత ఇల్లులేని మాకు టిడ్కో ఇల్లు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేలును జీవితంలో మరువలేం. మాకు సొంత చిరునామా ఇచ్చిన మహానుభావుడు జగనన్న. ఇంత మంది పేదలకు పక్కా ఇళ్లు కట్టించిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. పేదల సంక్షేమం కోసం పాటుపడే అలాంటి నాయకులకు ప్రజలందరూ అండగా నిలవాల్సిన అవసరముంది. – రమ్య, లబ్ధిదారు, పుంగనూరు

సంతోషంగా ఉంది



ఇది వరకు మేము పెద్దల కాలం నాటి ఇంట్లో ఉండేవాళ్లం. చిన్నపాటి వర్షానికే అది ఉరుస్తుండేది. దీంతో ఇంటిల్లిపాదీ నానా అవస్థలు పడేవాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎలాంటి సిఫార్సు లేకుండానే మాకు ఇల్లు మంజూరు చేశారు. సకాలంలో బిల్లులు మంజూరు చేశారు. ప్రభుత్వ చేయూత కారణంగా సొంతిల్లు నిర్మించుకున్నాం. ఎంతో సంతోషంగా ఉంది.

– బి.పుష్పలత, లబ్ధిదారు, కొండామర్రి, చౌడేపల్లె మండలం

జగనన్న పుణ్యమే



ఉమ్మడి కుటుంబంలో చిన్నపాటి ఇంట్లోనే అందరం తలదాచుకునే వాళ్లం. ఏళ్ల తరబడి సొంతింటి కోసం కలలుగన్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దరఖాస్తు చేసుకోగానే ఇల్లు మంజూరు చేశారు. సర్కారు అందించిన ఆర్థికసాయంతోపాటు కొంత సొమ్ము వెచ్చించి చక్కటి ఇల్లు కట్టుకున్నాం. ఏదిఏమైనా జగనన్న పుణ్యాన ఇన్నేళ్లకు మాకంటూ ఓ గృహం నిర్మించుకోగలిగాం. – టి.కవిత, లబ్ధిదారుల, గానుగచింత దాసరిగుడెం, రొంపిచెర్ల మండలం

పదేళ్ల స్వప్నం



పక్కా ఇంటి కోసం పదేళ్లుగా ప్రదక్షిణలు చేశా. గత ప్రభుత్వాల హయాంలో పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాతే మాకు ఇల్లు మంజూరు చేశారు. కావాల్సిన ఆర్థిక సాయం అందజేశారు. దీంతో మా పదేళ్ల స్వప్నం నెరవేరింది. సొంతింటిలో కాపురముంటే అదృష్టం వచ్చింది.

– కె.నందిని, గానుగచింత, రొంపిచెర్ల మండలం

రుణపడి ఉంటాం



నేను చింతపండు కొట్టినా, నాభర్త పెయింటింగ్ పనులు చేసినా సొంతిల్లు నిర్మించుకోవాలన్న కోరిక తీరే పరిస్థితి లేదు. ఆ సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చారు. ఆయన మాట మీద నమ్మకంతో ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా. ఒకే రోజులో టిడ్కో ఇల్లు మంజూరు చేశారు. అద్భుతంగా నిర్మించిన గృహం అందించారు. నవంబర్‌లో గృహ ప్రవేశం కూడా చేశాం. మా కుటుంబం సంతోషంగా ఉందంటే అందుకు జగనన్నకే కారణం. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– ఎం.రత్నమ్మ, లబ్ధిదారు, పుంగనూరు

జగనన్న పాలనే కావాలి



నాభర్త మేస్త్రీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అందరి గృహాలు నిర్మిస్తున్నాడే కానీ మేం మాత్రం సొంతిల్లు కట్టుకోలేకపోయాం. చాలీచాలని సంపాదనతో నెట్టుకొస్తున్నాం. ఇక ఇంటి నిర్మాణం అంటే మాకు అలవికాని పనే. అలాంటి సమయంలో జగనన్న ప్రభుత్వం వచ్చింది. ముందుగా మాకు ఇంటి స్థలం అందించింది. నిర్మాణ పనులకు చేయూతనందించింది. దీంతో చక్కటి ఇల్లు కట్టుకున్నాం. మాకు ఎప్పటికీ జగనన్న పాలనే కావాలి.

– కె.లలిత, లబ్ధిదారు, పుంగనూరు

కల నెరవేరింది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాకు స్థలం పట్టా ఇచ్చి ఇల్లు మంజూరు చేశారు. మా జగనన్న కాలనీలో మంచి వసతులు కల్పించారు. ఇంటి నిర్మాణానికి కావాల్సిన సాయం అందజేశారు. ఆయన సహాయంతోనే సొంతిల్లు కట్టుకున్నాం. దీంతో మా కల నెరవేరింది. పేదల కష్టాలు తెలిసిన జగనన్నే చిరకాలం ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నాం.

– అమరావతి, లబ్ధిదారు, పుంగనూరు

నేరాలకు కళ్లెం..!



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

- ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్ : కట్టుదిట్టమైన నిఘా.. పకడ్బందీ ప్రణాళిక.. ఎప్పటికప్పుడు సమీక్షలు.. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి.. అక్రమ మద్యం, ఎర్రచందనం, గంజాయి రవాణాపై ఉక్కుపాదం.. సైబర్ క్రైమ్‌పై క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సులు.. హత్యలు, దాడులపై కఠిన వైఖరి కారణంగా జిల్లాలో నేరాలను నియంత్రించినట్లు ఎస్పీ రిశాంత్‌రెడ్డి తెలిపారు. శనివారం ఈ మేరకు 2023 నేర నివేదికను మీడియాకు వివరించారు. ఆయన మాటల్లోనే..

- కమ్యూనిటీ పోలీసింగ్, ప్రజల సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణ వ్యవస్థను పటిష్టం చేశాం. నూతన సాంకేతికను అందిపుచ్చుకుని నేర నిరూపణలో 96 శాతం వృద్ధి సాధించాం.
- రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాం. బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి తగు జాగ్రత్తలు చేపట్టాం. ఈ క్రమంలోనే గత ఏడాది 711 రోడ్డు ప్రమాదాలు సంభవిస్తే.. ఈ ఏడాది 324కు తగ్గాయి.
- మద్యం, గంజాయి అక్రమ రవాణాను కట్టడి చేశాం. ఎస్ఈబీ ద్వారా 1,792 కేసులు నమోదు చేసి, 1,591 మందిని అరెస్ట్ చేశాం. 312 వాహనాలను స్వాధీనం చేసుకున్నాం. 658 మందిని బైండోవర్ చేశాం. అలాగే రూ.13 లక్షలు విలువైన 106 కిలోల గంజాయిని సీజ్ చేశాం. 8 మందిని అరెస్ట్ చేశాం.
- ఎర్రచందనం స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపాం. ఈ ఏడాది 9 కేసులు నమోదుచేసి 58 మందిని అరెస్ట్ చేశాం. రూ.1.8 కోట్ల విలువైన 2,095 కేజీల దుంగలు, 21 వాహనాలను స్వాధీనం చేసుకున్నాం.
- దిశ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నాం. బాధిత మహిళలకు ఫిర్యాదులపై తక్షణం స్పందిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 1,633 ఫిర్యాదులు స్వీకరించాం. ఈ ఏడాదిలో 19,872 మందితో దిశ యాప్ డౌన్‌లోడ్ చేయించాం.
- మహిళా పోలీస్ వ్యవస్థను ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దాం. 35 స్టేషన్ల పరిధిలోని 512 మంది మహిళ పోలీసులతో ఇంటింటి సర్వే చేపట్టాం. మొత్తం 727 ఫిర్యాదులు రాగా, 640 పరిష్కరించాం.
- ఆధునిక సాంకేతికతను వినియోగించి సెల్‌ఫోన్లన రికవరీ చేశాం. ఈ ఏడాది సుమారు రూ.2.50 కోట్లు విలువైన 1,200 సెల్‌ఫోన్‌లను పట్టుకున్నాం. బాధితులు ఇతర రాష్ట్రాల్లో ఉంటే వారికి కొరియర్ ద్వారా ఫోన్లను అందజేశాం.

- డయల్ 100 ద్వారా తక్షణమే పోలీస్ సేవలు అందిస్తున్నాం. ఈ ఏడాది 6,504 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో 281 ఫిర్యాదులపై కేసులు నమోదు చేశాం. అలాగే పోలీసు సేవా యాప్ ద్వారా 4,410 ఫిర్యాదుల రాగా 4,410 పరిష్కరించాం.

పాపానాయుడుపేటలో దొంగలు పడ్డారు

- బంగారు దుకాణం లూటీ
- తుపాకులు, కత్తులు, రాడ్లతో చొరబడ్డ ముఠా
- కాల్పులు జరిపి, షాపులోని అద్దాలను పగులగొట్టిన వైనం
- ఆభరణాలతో పరారైన దొంగలు.. ఒకరిని పట్టుకున్న స్థానికులు



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న ఇనుప చీలల సంచి



పట్టుబడిన మారణాయుధం



అదుపులో నిందితుడు

సాక్షి, తిరుపతి: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గం, ఏర్పేడు మండలం, పాపానాయుడుపేటలో దొంగలు పడ్డారు. తుపాకులు, రాడ్లతో బంగారు దుకాణంలోకి చొరబడ్డారు. కొనుగోలు దారులు, యజమానిని భయపెట్టి నగలను అపహరించుకెళ్లారు. పారిపోతున్న వారిలో ఒకరిని మాత్రం స్థానికులు పట్టుకుని తాళ్లతో కట్టేసి పోలీసులకు అప్పజెప్పారు. స్థానికుల కథనం మేరకు.. రేణిగుంట సర్కిల్ పరిధిలోని పాపానాయుడుపేట సినిమా హాలు వీధిలోకి హెల్మెట్లు ధరించి రెండు ద్విచక్ర వాహనాల్లో ముగ్గురు అగంతుకులు ప్రవేశించారు. వేగంగా ఆ వీధిలోకి వెళ్లి ఎస్ఎస్ జ్యువెలరీ వద్ద వాహనాలను ఆపారు. తన చేతిలో ఉన్న ఓ తుపాకీని పేల్చారు. కదలొద్దు.. అరవొద్దు అంటూ కత్తులు, తుపాకీ చూపిస్తూ బెదిరించారు. దుండగుల చేత ఉన్న రాడ్లతో దుకాణం అద్దాలను ధ్వంసం చేశారు. అద్దాల్లో ఉన్న బంగారు ఆభరణాలను బ్యాగులో వేసుకుని తుపాకీని పేల్చుకుంటూ వచ్చి బైక్‌లో పరారయ్యేందుకు ప్రయత్నించారు. సినిమా థియేటర్ వద్ద అడ్డొచ్చిన వారిని తుపాకీతో బెదిరించారు. మరోవ్యక్తి ఐరన్ స్పిన్ బాల్స్‌తో ఉన్న బ్యాగుతో పరారయ్యేందుకు యత్నించాడు. ఎవరైనా అడ్డొస్తే ఈ ఐరన్ స్పిన్ బాల్ ఉన్న బ్యాగుతో బలంగా దాడిచేయొచ్చని భావించారు. ఒక యువకుడు పరారయ్యే క్రమంలో స్థానికులు చాకచక్యంగా అతన్ని పట్టుకున్నారు. బ్యాగు వీపునకు తగిలించుకుని ఉండడంతో దుండగుడు కిందపడ్డాడు. స్థానికులు ఒక్కసారిగా చుట్టుముట్టి దుండగుడ్ని పట్టుకుని తాళ్లతో కట్టేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటా హుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న గాజులమండ్యం పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

భయభ్రాంతులకు గురైన స్థానికులు

రెండు బైక్‌ల్లో వచ్చిన దుండగులు క్షణాల్లో పాపానాయుడుపేటలో భయభ్రాంతులకు గురిచేశారు. తుపాకీ పేలుడు శబ్దంతో ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి. దుకాణంలో ఆభరణాలు కొనేందుకు వచ్చిన మహిళలు హఠాత్పరిణామాన్ని చూసి నోటమాట రాకుండా వణికిపోయారు. దుకాణంలో ఉన్న యజమాని సైతం ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి. తుపాకీ, కత్తులు, రాడ్లు చూపిస్తూ లోనికి చొరబడ్డ వారంతా యువకులే. దుండగులది రేణిగుంటలోని జ్యోతినగర్ వాసులుగా అనుమానిస్తున్నారు.

పక్కా ప్లాన్?

పాపానాయుడుపేట సినిమా వీధిలో ఉన్న బంగారు నగల దుకాణంలో చోరీ చేసేందుకు దుండగులు పక్కా ప్లాన్ ప్రకారమే చొరబడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వారంపది రోజులుగా ఆ ప్రాంతంలో తిరుగుతూ లూటీకి స్కెచ్ వేసి ఉంటారని తెలుస్తోంది. ఇందులో భాగంగానే పెద్దగా జనసంచారం లేని పాపానాయుడుపేట సినిమా హాలు వీధిలోని జ్యువెలరీ దుకాణాన్ని ఎంచుకున్నట్లు సమాచారం.

శాస్త్రోక్తం.. సంకటహర చతుర్థి వ్రతం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శనివారం శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించారు. పౌర్ణమి అనంతరం నాలుగోరోజున ఈ వ్రతం జరిపించడం ఆనవాయితీ. ఈ మేరకు ఉదయం 10 గంటలకు మళ్లీ సాయంత్రం 5 గంటలకు రెండు పర్యాయాలు చేపట్టారు. ఈ సందర్భంగా తొలుత సిద్ధి, బుద్ధి, సమేత వినాయక స్వామి ఉత్సవర్లను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆస్థాన మండపంలో కొలువుదీర్చారు. అనంతరం వేద మంత్రోచ్ఛారణల నడుమ వత్రం ఆచరించారు. కార్యక్రమంలో ఈఓ వెంకటేశు, సూపరింటెండెంట్ కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్ బాబు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



వ్రతం నిర్వహిస్తున్న వేదపండితులు, ఆచరిస్తున్న భక్తులు

క్లుప్తంగా

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కావేటిగారి పల్లె పంచాయతీ కూనపల్లె సమీపంలోని పంట పొలాలపై శనివారం వేకువజామున ఏనుగులు దాడి చేశాయి. అరటి, టమాట, మొక్కజొన్న పంటలను నాశనం చేశాయి. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగులను కట్టడి చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

కానిస్టేబుల్‌పై దాడి : కేసు నమోదు

పుత్తూరు: వడమాలపేట మండలం పాదిరేడు బైపాస్ రోడ్డులో శనివారం మఫ్టీలో ఉన్న టాస్క్‌ఫోర్స్ పోలీసుపై ఓ వ్యక్తి దాడి చేశాడు. పాదిరేడుకు చెందిన రైతు ఆర్.ధనంజయుల నాయుడు ద్విచక్ర వాహనంపై వేరుశనగ విత్తనాల బస్తాతో వస్తుండగా పోలీసు అడ్డుకున్నాడు. వాహనం తనిఖీ చేస్తుండగా కానిస్టేబుల్‌పై ధనంజయనాయుడు దాడికి దిగారు. టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ లింగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

6 కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగేశ్వరరావు

వెంకటగిరి రూరల్: చెన్నైకి గంజాయిని తీసుకెళ్తున్న ఇద్దరు వ్యక్తులను సెబ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న ఘటన శనివారం పట్టణంలో చర్చనీయాంశమైంది. ఈ మేరకు సెబ్ సీఐ నాగేశ్వరరావు శనివారం విలేకరులతో మాట్లాడుతూ వెంకటగిరి రైల్వేస్టేషన్ పరిసరాల్లో తనిఖీలు నిర్వహిస్తుండగా కాంచీపురానికి చెందిన సేతు నవీన్‌కుమార్, మురుగేశన్ నిర్మల్‌కుమార్‌లు అనుమానాస్పదంగా కనిపించారన్నారు. తనిఖీలు నిర్వహించగాఆరు కిలోల గంజాయి పట్టుబడినట్లు వెల్లడించారు. దీని విలువ రూ.1.2 లక్షలు ఉంటుందని తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ గంగాధర్, కానిస్టేబుల్ మునిశేఖర్, రఫీ, పుట్టయ్య పాల్గొన్నారు.

వసతులు మెరుగు'బడి'

నాడు–నేడు పథకం కింద సర్కారు బడుల రూపురేఖలు మారిపోయాయి. అత్యాధునిక వసతులతో కార్పొరేట్‌కు దీటుగా తయారయ్యాయి. విద్యార్థులకు పరిశుభ్రమైన తాగు నీరు అందుబాటులోకి వచ్చింది. కాలకృత్యాలు తీర్చుకునేందుకు బహిరంగ ప్రదేశాలకు పరుగులు తీయాల్సిన అవస్థ తప్పింది. ఆహ్లాదకర వాతావరణంలో విద్యాభ్యాసం చేసే వెసులుబాటు వచ్చింది. ఈ క్రమంలో ప్రతిష్టాత్మక పథకంపై విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆనందం వారి మాటల్లోనే..

– చిత్తూరు కలెక్టరేట్



నాడు-నేడు కింద తీర్చిదిద్దిన కీలపట్ల హైస్కూల్

భవిష్యత్‌కు పునాది



నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దారు. అన్ని వసతులు సమకూర్చారు. గత టీడీపీ హయాంతో కేవలం కార్పొరేట్ విద్యాసంస్థలకే కొమ్ము కాశారు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద పిల్లల భవిష్యత్‌కు చక్కటి పునాది వేస్తున్నారు. రూ.వేల కోట్లు వెచ్చించి విద్యారంగం అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

– నరేంద్ర, విద్యార్థి తండ్రి, కొత్తపల్లె, గంగవరం మండలం



నాణ్యమైన విద్య



ప్రభుత్వ పాఠశాలల్లో చక్కటి మౌలిక వసతులతో పాటు నాణ్యమైన విద్య అందిస్తున్నారు. ఒకప్పుడు ఇంగ్లిష్ మీడియంలో చదవాలంటే కార్పొరేట్ బడుల్లోనే అందుబాటులో ఉండేది. అది కూడా సంపన్నులకు మాత్రమే సాధ్యపడేది. ఇప్పుడు కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులను తీర్చిదిద్దారు. పేద బిడ్డల ఉన్నత భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తున్నారు.

– రెడ్డెప్ప, కీలపట్ల, గంగవరం మండలం

అడ్మిషన్లు పెరిగాయి



ప్రభుత్వ పాఠశాలల్లో ఈ స్థాయి వసతులను ఇప్పుడే చూస్తున్నాం. గతంలో ఎన్నడూ సర్కారు బడులను పట్టించుకున్న వారు లేరు. ప్రస్తుతం కార్పొరేట్ స్కూళ్ల కంటే మా బడుల్లో చేరేందుకే అందరూ ఆసక్తి చూపుతున్నారు. మా ప్రాథమిక పాఠశాలను రూ.22లక్షలతో అభివృద్ధి చేశాం. పిల్లల అభ్యసన సామర్థ్యాలను పెంచేలా పాఠ్యాంశాలు బోధిస్తున్నాం. ఈ క్రమంలో మా పాఠశాలలో అడ్మిషన్ల సంఖ్య కూడా పెరిగింది.

– వెంకటరామయ్య, ప్రధానోపాధ్యాయుడు, కొత్తపల్లె ప్రాథమిక పాఠశాల

డిజిటల్ పాఠాలు



నాడు నేడు పథకం కింద మా హైస్కూల్ చూడముచ్చటగా తయారైంది. కార్పొరేట్ స్కూళ్లలో కూడా ఇన్ని వసతులు ఉండవు. సుమారు రూ.41లక్షలతో అత్యాధునిక వసతులు కల్పించాం. గ్రీన్‌చాక్ బోర్డులు, ఖరీదైన ఐఎఫ్‌పీ ప్యానల్‌ను ప్రభుత్వం సమకూర్చింది. డిజిటల్ విధానంలో విద్యార్థులకు పాఠాలు బోధించే అవకాశం మాకు దక్కింది. ముఖ్యమంత్రి ఉన్నత ఆశయానికి అభినందనలు.

– రాము, ఉపాధ్యాయుడు, కీలపట్ల హైస్కూల్

యూరియా..కొరత లేదయా



నెలబల్లి ఆర్బీకేలో రైతులకు యూరియా బస్తాలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

పచ్చమీడియా అబద్ధపు రాతలు

- ఆర్బీకేల్లో ఎరువుల కొరత అంటూ తప్పుడు కథనాలు
- యూరియాకు ఢోకాలేదంటున్న అధికారులు

తిరుపతి అర్బన్: ఎదుటే పుష్కలంగా ఎరువులున్నా ఆ పత్రికకు కనిపించ లేదేమో. ఆర్బీకేల్లో యూరియా కొరతంటూ తప్పుడు కథనాలతో రైతులను గందరగోళంలోకి నెట్టడమే పనిగా పెట్టుకుంది. గోరంతను కొండంతలు చేస్తూ అయోమయానికి గురిచేస్తోంది. ప్రభుత్వంపై విషం కక్కడమే పనిగా పెట్టుకుని అబద్ధపు ప్రచారానికి తెరలేపుతోంది. తమ అనుకూల పార్టీకి కొమ్ముకాస్తూ ఎలాగైనా అధికారంలోకి తీసుకురావాలని కుయుక్తులు పన్నుతోంది. ఇందులో భాగంగానే విలువలు, విశ్వసనీయతను కాలరాస్తూ నవ్వులపాలవుతోంది. రబీసీజన్‌కు సంబంధించి ప్రభుత్వం రైతులకు కావాల్సినన్ని ఎరువులు మంజూరు చేస్తున్నా ఆ పత్రిక అనవసర రాద్ధాంతం చేయడం విమర్శలకు తావిస్తోంది.

అసలు విషయం ఏంటంటే

జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి 1.24 లక్షల ఎకరాల్లో వరి సాగుచేశారు. ఇటీవల మిచాంగ్ తుపాన్ కారణంగా కొన్ని మండలాల్లో పంట దెబ్బతింది. దీంతో రైతులు మళ్లీ వరినాట్లకు సిద్ధమయ్యారు. అయితే ముందస్తుగా నాటిన వరి మడులు ప్రస్తుతం పొట్ట దశలో ఉన్నాయి. దీనికి యూరియా పెద్దగా అవసరం లేదు. దీంతో వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకు ఆయా ఆర్బీకేల్లో యూరియాని నిల్వ చేయడంలేదు. ఒకటి రెండు చోట్ల అవసరాన్ని బట్టి యూరియా దింపుతున్నారు. కానీ పచ్చమీడియా ఆయా ఆర్బీకేలను ఎంచుకుని అక్కడ యూరియా నిల్వ లేదంటూ తప్పుడు కథనాలు రాసి రైతులను మభ్యపెడుతోంది.

అవసరాన్ని మించి ఎరువులు

రబీలో రైతులకు కావాల్సిన ఎరువులు మొత్తం 52,053 మెట్రిక్ టన్నులుకాగా ఇప్పటివరకు 77,955 మెట్రిక్ టన్నుల ఎరువులు తెప్పించారు. ఇందులో యూరియా 37,982 మెట్రిక్ టన్నులు, డీఏపీ 6,173, ఎంఓపీ 1,917, కాంప్లెక్స్ 28,611, ఎస్ఎస్‌పీ 3, 272 ఉన్నాయి. ఇప్పటివరకు యూరియా 26,998 మెట్రిక్ టన్నులు విక్రయించారు. అలాగే డీఏపీ 4,142, ఎంఓపీ 1,034, కాంప్లెక్స్ 16,686, ఎస్ఎస్‌పీ 1,740 వరకు విక్రయించినట్లు అధికారులు చెబుతున్నారు. ఇక యూరియా 10,983 మెట్రిక్ టన్నులు, డీఏపీ 2,030, ఎంఓపీ 883, కాంప్లెక్స్ 11,924, ఎస్ఎస్‌పీ 1,531 నిల్వ ఉన్నట్టు తెలిపారు. అవసరమైన చోట నివేదికలందిన వెంటనే ఎరువులు సరఫరా చేస్తున్నట్టు వెల్లడించారు.

పుష్కలంగా ఎరువులు



జిల్లాలో ఎరువుల కొరత లేదు. అన్ని రకాల ఎరువులను ఎప్పటికప్పుడు తెప్పించి ఇస్తున్నాం. రైతు భరోసా కేంద్రాల్లో నిల్వ ఉంచుతున్నాం. ఈసారి వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలకు 15,552 మెట్రిక్ టన్నుల ఎరువులు తెప్పించాం. అందులో ఇప్పటివరకు 11,256 మెట్రిక్ టన్నులు విక్రయించారు. ఇంకా 4,296 మెట్రిక్ టన్నులు నిల్వ ఉంది. అవసరమైతే ప్రతిపాదనలు పంపిన మూడు రోజుల్లో ఎరువులు అందజేస్తాం. అదనపు ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవు. – ఎస్.ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

యూరియా కొరత లేదు



దొరవారిసత్రం మండల పరిధిలో 11 ఆర్బీకేలు ఉన్నాయి. వీటి పరిధిలోని రైతులకు అవసరాన్ని బట్టి ఎప్పటికప్పుడు ఎరువులు అందిస్తున్నాం. ఎక్కడా యూరియా కొరతలేదు. ఇప్పటివరకు 884 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయించాం. మండలంలో కొన్ని చోట్ల ముందస్తుగా వరినాట్లు వేశారు. ఆయా ప్రాంతాల్లోని రైతులకు యూరియా అవసరంలేదు. అవసరం ఉన్న చోట ఎరువులు తెప్పిస్తున్నాం. శనివారం నెలబల్లి ఆర్బీకేకు 22టన్నుల యూరియా వచ్చింది. – జ్యోతిర్మయి, ఏఓ, డీవీ సత్రం

అందుబాటులో 450 మెట్రిక్ టన్నులు



ప్రస్తుతం యూరియా కొరతలేదు. తుపాన్‌కు ముందు వరినాట్లు వేసుకున్న రైతులకు సరిపడే విధంగా యూరియా పంపిణీ చేశాం. ప్రస్తుతం 60 రోజులు దాటిన వరి పైర్లకు యూరియా అవసరం లేదు. తుపాన్ తర్వాత వరినాట్లు వేసుకున్న రైతులకు యూరియా అందుబాటులో ఉంచాం. తడ మండలంలో 450 మెట్రిక్ టన్నుల యూరియా ఉంది.

– ఎస్ఎస్.కాంచన, ఏఓ, తడ

తొమ్మిది మంది ఎర్ర దొంగల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తిరుపతి మంగళం: శేషాచలం అడవుల్లో నుంచి అక్రమంగా తరలిస్తున్న 15 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, రెండు వాహనాలను సీజ్ చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. అటవీశాఖ అధికారుల కథనం.. తిరుమలలోని మామిళ్ల మంద ప్రదేశం వద్ద రెండు వాహనాలు అడవిలోకి ప్రవేశించి ఎర్రచందనం దుంగలను తరలించేందుకు ప్రయత్నిస్తుండగా అటవీశాఖ అధికారులు వారిని ముట్టి తొమ్మిది మంది స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. కారులో ఉన్న 15 ఎర్రచందనం దుంగలతోపాటు ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.9 లక్షలు ఉంటుందని తెలిపారు. స్మగ్లర్లపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు వెల్లడించారు. ఎఫ్ఆర్ఓలు బీ.సుదర్శన్‌రెడ్డి, జీ.చెంచులక్ష్మి, ఎఫ్‌బీఓ ఎం.మురళి, వాచర్లు పాల్గొన్నారు.

సంక్రాంతి తర్వాత రాజకీయ చైతన్య యాత్ర



కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిని సత్కరిస్తున్న నేతలు

తిరుపతి కల్చరల్: కురబల అభివృద్ధే లక్ష్యంగా 2024 సంక్రాంతి తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా కురుబ, కురుమ, కురువల రాజకీయ చైతన్య యాత్ర చేపట్టనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ రాజకీయ చైతన్య యాత్ర కుప్పం నుంచి కర్నూల్ వరకు, అటు ఒంగోలు నుంచి గోదావరి జిల్లాల వరకు నిర్వహిస్తామన్నారు. ఈనెల 26వ తేదీన మదనపల్లిలో శ్రీభక్త కనకదాసు జయంతి వేడుకలు విజయవంతం కావడం అభినందనీయమన్నారు. కురుబ సంఘం ఉపాధ్యక్షుడు కే.రెడ్డికుమార్, యువత విభాగం నేత శ్రీనివాసులు, జిల్లా నేతలు రెడ్డెప్ప, రఘురామ్, రమేష్, కృష్ణయ్య, మల్లయ్య, నాగసుబ్బయ్య, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.